క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 20, పచ్చిమిర్చి 45 , బెండ 40, కాకర 35, దొండ 30, దోస 30, ఆలు 25, చామ 50, కీర 30, బీర 35, వంకాయ 40, గోకర 40, బీన్స్ 80, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 25, క్యారెట్ 50, చిక్కుడు 80, ఉల్లి 30 (1 కేజీ), ములక్కాయలు (3) 20 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 30, అల్లం 180, వెల్లుల్లి 200.

ఉచిత కంటి వైద్యశిబిరం



కళ్లద్దాలను అందజేస్తున్న భిక్షపతి యాదవ్ తదితరులు

మియాపూర్ : మియాపూర్‌లోని న్యూ కాలనీలో సందయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ వైద్య శిబిరాన్ని ప్రారంభించి అవసరమైన వారికి కళ్లద్దాలను, మందులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వినోద్‌రావు, నాగులుగౌడ్, బొబ్బ నవతారెడ్డి, మాణిక్‌రావు, లక్ష్మణ్ ముదిరాజ్, శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మిలటరీ హోటల్‌ను ప్రారంభించిన మేయర్



శేరిలింగంపల్లి: నల్లగండ్ల హుడాకాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 1980 మిలటరీ హోటల్‌ను శుక్రవారం నగర మేయర్ గద్వాల విజయలక్ష్మీ, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ రుచికరమైన ఆహార పదార్థాలు అందించే వారు వినియోగదారుల మన్ననలు పొందుతారన్నారు.

ఆకట్టుకుంటున్న పల్లె చిత్రాలు



మాదాపూర్: చిత్ర కళాకారుడు అగాచార్య వేసిన పల్లెటూరి అందాలను తలపించే చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో ఏర్పాటు చేసిన విజువల్ నెరేటివ్స్ పేరిట ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శన అక్టోబర్ 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. పల్లెటూరి వాతావరణం, సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టి పడే విధంగా చిత్రాలు గీసినట్టు తెలిపారు. ఈ ప్రదర్శన ఉదయం 11గంటల నుంచి రాత్రి 7గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు

- హెచ్‌సీయూ తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

రాయదుర్గం: తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు రావడమనేది సమాజంలో వస్తున్న మార్పులకు, ఒక ప్రజాస్వామిక ఆలోచనా ధోరణికి నిదర్శనమని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు వ్యాఖ్యానించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ తెలుగు శాఖ కార్యాలయం నుంచి జంగారెడ్డిగూడెంలోని ఛత్రపతి శివాజీ త్రిశత జయంతి వేడుకల్లో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు' అనే అంశంపై ఒక రోజు అంతర్జాతీయ సదస్సులో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యం ఒకవైపు భారతీయ సమైక్యతను, సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగిస్తూనే, తెలుగు వారి అస్తిత్వాన్ని కాపాడుకుంటూ సామాజిక మార్పుని ఆహ్వానిస్తూ వివిధ సాహిత్య ధోరణులు వచ్చాయని ఆయన సోదాహరణంగా వివరించారు. ఆధునిక వచన కవిత్వంలో వచ్చిన మార్పుల్లో మినీ కవిత్వం, హైకూలు, నానీలు, నానోలు, ముక్తకాలు, టుప్రీలు, మొగ్గలు, రవ్వలు, రెక్కలు మొదలైన ప్రయోగాలు కనిపిస్తున్నాయని వాటిని సాహిత్యంలో నూతనత్వానికీ ,నూతన అభిరుచులకు ప్రాతినిధ్యాలుగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు తెలుగు సాహితీవేత్తలు, అధికారులు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు ప్రసంగించారు.

దుర్గం చెరువు.. సంగీత సవ్వడి

- ఆకట్టుకుంటున్న 7 రంగుల మ్యూజికల్ వాటర్ ఫౌంటేన్
- రోజూ నాలుగు షోలు.. రాత్రి 7గంటల నుంచి 10 గంటల మధ్య..
- 7 పాటలు.. సుమారు 30 నిమిషాల పాటు ఒక షో
- పెరుగుతున్న సందర్శకులు.. కూర్చుని చూసే విధంగా ఏర్పాట్లు



రంగురంగుల వాటర్ ఫౌంటేన్

మాదాపూర్: దుర్గం చెరువులో ఏర్పాటు చేసిన మ్యూజికల్ వాటర్ ఫౌంటేన్ సందర్శకులను ఆకట్టుకుంటోంది .రంగురంగుల వాటర్ ఫౌంటేన్ అందాల నడుమ కేబుల్ బ్రిడ్జి మరింత అందంగా కనిపిస్తుంది. దీంతో సందర్శకులు పెరుగుతున్నారు. బిజీ జీవితంలో ప్రజలకు ఉత్సాహాన్ని కలిగించే విధంగా రోజుకు నాలుగు షోలను నిర్వహిస్తున్నారు. వాటర్ ఫౌంటేన్ అందాలను చూసేందుకు సందర్శకులు, సీనియర్ సిటిజన్లకు ఏర్పాటు చేసిన స్టేజి ఆకర్షణగా నిలుస్తుంది. రాత్రి 7 గంటల నుంచి 10గంటల వరకు షో ఉంటుంది. ప్రతి రోజు ఒక తెలుగు పాట, రెండు హిందీ పాటలు, రెండు దేశభక్తి పాటలు, ఇతర పాటలను వేస్తారు. ఈ మ్యూజికల్ వాటర్ ఫౌంటేన్ కేబుల్ బ్రిడ్జి వ్యూను కలిగి ఉంటుంది. రోజూ 500 మంది, వారాంతపు, సెలవురోజులలో 800 మంది వస్తుండగా మ్యూజికల్ వాటర్ ఫౌంటేన్ వల్ల దాదాపు 1000 మంది దాకా వస్తున్నట్టు సమాచారం.

చాలా బాగుంది



స్నేహితులతో వచ్చాను. మ్యూజికల్ వాటర్ ఫౌంటేన్ అందాలు అద్భుతంగా ఉన్నాయి. మనం నగరంలోనే ఉన్నామా అన్నట్టుగా ఉంది. కుటుంబాలతో వచ్చి సరదాగా గడపవచ్చు. కేబుల్‌బ్రిడ్జి, బోటింగ్, వాకింగ్ అన్ని ఒకే చోట ఉండడం బాగుంది.

–డాక్టర్ శరణ్య, సందర్శకురాలు

మరింత అభివృద్ధి చేయాలి



7 రంగులతో మ్యూజికల్ వాటర్ ఫౌంటేన్ ఆకట్టుకుంటోంది. దుర్గం చెరువును మరింత అభివృద్ధి చేయాలి. ఇతర దేశాల ప్రజలు వస్తున్నారు. దగ్గరలో శిల్పారామం , దుర్గం చెరువు, కేబుల్ బ్రిడ్జి ఉండడంతో ప్రతి ఒక్కరు ఇక్కడకు రావడానికి ఆసక్తి చూపుతున్నారు. సందర్శకుల కోసం మరిన్ని ఏర్పాట్లు చేయాలి.

–వంశీ కిషోర్ , సందర్శకుడు





గుజరాత్ హ్యాండీక్రాఫ్ట్ ఉత్సవ్-2023 ప్రారంభం





మేళా ప్రారంభోత్సవంలో టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, శిల్పారామం ప్రత్యేక అధికారి కిషన్‌రావు తదితరులు

మాదాపూర్: గుజరాత్ కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులు నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటాయని టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ పేర్కొన్నారు. శిల్పారామంలో అక్టోబర్ 8వ తేదీ వరకు నిర్వహించనున్న గుజరాత్ హ్యాండీక్రాఫ్ట్ ఉత్సవ్-2023ను శిల్పారామం ప్రత్యేక అధికారి కిషన్‌రావు, ఇండెక్స్ సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీపక్‌శుక్లతో కలసి ప్రారంభించారు. ఇందులో భాగంగా గుజరాతీ సాంప్రదాయ నృత్యాలు ప్రదర్శించనున్నారన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మేళాలో భాగంగా ఆంపి థియేటర్‌లో గుజరాతీ సాంప్రదాయ నృత్యాలు రాస్‌గర్బ ప్రదర్శించారు. జయంరాం నారాయణ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన సందర్శకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శిల్పారామం జనరల్ మేనేజర్ అంజయ్య, ఇండెక్స్ సీ మార్కెటింగ్ మేనేజర్ స్నేహాల్ మఖ్వానా తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో సుమారు రూ.26 కోట్ల నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ పరిధిలోని రామచంద్రాపురం, భారతీనగర్, పటాన్‌చెరు డివిజన్‌ను అభివృద్ధి బాటలో నడిపిస్తున్నామని తెలిపారు. నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప నగేష్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షులు గోవింద్, సీనియర్ నాయకులు ఆదర్శ్ రెడ్డి, కుమార్ గౌడ్, పరమేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు..

గచ్చిబౌలి: శేరిలింగంపల్లిలోని కొండాపూర్, లింగంపల్లి, రాఘవేంద్రకాలనీ, పాపిరెడ్డికాలనీ, మార్తాండనగర్ కాలనీల్లోని వినాయక మండపాల వద్ద జరిగిన పూజల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రఘునాథ్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా మండపాల వద్ద ఉత్సవ సమితి నాయకులు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శశికాంత్, రాములుగౌడ్, సలీమ్, భరత్‌యాదవ్, కిరణ్‌రెడ్డి, నిర్మల, రామకృష్ణ, వెంకటేశ్వర్‌రెడ్డి, మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్ డివిజన్‌లో..

కొండాపూర్ డివిజన్‌లోని రాజరాజేశ్వరినగర్ కాలనీలో గణేషుడి ప్రత్యేక పూజలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి ఆధ్వర్యంలో రవికుమార్ యాదవ్‌ను ఘనంగా సత్కరించి పూలమొక్కను బహూకరించారు. కార్యక్రమంలో నాయకులు, ఉత్సవ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.



రాజరాజేశ్వరినగర్‌లో.. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్



శేరిలింగంపల్లిలో.. కాంగ్రెస్ నాయకుడు రఘునాథ్

విద్యార్థులకు రక్త పరీక్షలు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): మండలంలోని ఇందిరానగర్ కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం రక్త పరీక్షలు చేశారు. జిల్లా అధికారి శిరీష, ఫైలేరియా జిల్లా వైద్యుడు భాస్కర్‌లు 75మంది విద్యార్థులకు రక్త పరీక్షలు చేసి మందులను అందించారు. ప్రతి విద్యార్థి ఫైలేరియాకు సంబంధించి రక్త పరీక్షలను చేయించుకోవాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎలీస్‌రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చండీ హోమం

జిన్నారం(పటాన్‌చెరు): బొంతపల్లిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో శుక్రవారం చండీహోమం చేశారు. ప్రతి నెల పౌర్ణమికి చండీ హోమం చేస్తున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శశిధర్, నిర్వాహకులు సోమయ్య, భక్తులు పాల్గొన్నారు.

గణనీయమైన వృద్ధిలో బీ2బీ మార్కెట్

పటాన్‌చెరు టౌన్ : బిజినెస్-టు-బిజినెస్ (బీ2బీ) ఇ-కామర్స్ మార్కెట్ గణనీయమైన వృద్ధిని సాధిస్తోందని ఆఫిజినెస్ ప్రాంతీయ అధిపతి మోహిత్ చౌదరి అన్నారు.గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, రుద్రారం విద్యార్థులతో శుక్రవారం ఆయన ముఖాముఖి నిర్వహించారు.సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు తమ అవసరాల సేకరణ కోసం బీ2బీ మార్కెట్ ప్లేస్‌లోకి ప్రవేశిస్తున్న ధోరణిని ఆయన వివరించారు. భారత ఆన్ లైన్ బీ2బీ మార్కెట్స్-2030 నాటికి 200 బిలియన్ల డాలర్ల విలువైన మార్కెట్ అవకాశాన్ని చేరుకునే సామర్థ్యాన్ని కలిగి ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు.

అంగన్‌వాడీల భిక్షాటన



రామచంద్రాపురం(పటాన్‌చెరు): సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 19వ రోజు సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ ఉపాధ్యాయులు శుక్రవారం భిక్షాటన చేశారు.ఈ సందర్భంగా అంగన్‌వాడీ రామచంద్రాపురం సెక్టార్ నాయకులు కల్పన, షమదేవిలు మాట్లాడుతూ 19రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగలగొడుతూ బెదిరింపులకు గురిచేస్తుందని వాపోయారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో నిరసన ఆగదని తెలిపారు. విజయలక్ష్మి, మంజుల, సుజాత పాల్గొన్నారు.

వరల్డ్ హార్ట్ డే.. సీపీఆర్‌పై శిక్షణ

మాదాపూర్: వరల్డ్ హార్ట్ డే సందర్భంగా మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డా.శరత్‌రెడ్డి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితి ఏర్పడినపుడు మరణం సంభవించకుండా సీపీఆర్ ద్వారా కాపాడేందుకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. మెడికవర్ హాస్పిటళ్లలో దేశవ్యాప్తంగా 30వేల మందికి పైగా శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. హార్ట్ సేవర్స్ పేరుతో దేశవ్యాప్తంగా సీపీఆర్ శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ ప్రచారంలో పాఠశాలలు, రెసిడెన్షియల్ సొసైటీలు, ప్రభుత్వ ఏజెన్సీలు, పోలీస్‌స్టేషన్‌లు, వివిధ కమ్యూనిటీలు ముఖ్యపాత్ర పోషించాలని కోరారు. కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ అనిల్‌కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



ఆసుపత్రిలో యువతకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సిటిజన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వాక్‌థాన్



నల్లగండ్ల సిటిజన్ హాస్పిటల్ నుంచి ప్రారంభమైన వాక్ థాన్

శేరిలింగంపల్లి: వరల్డ్ హార్ట్ డే సందర్భంగా శుక్రవారం నల్లగండ్లలోని సిటిజన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది వాక్ థాన్ నిర్వహించారు. సిటిజన్ హాస్పిటల్ నుంచి భెల్ చౌరస్తా వరకు హాస్పిటల్ రీజినల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ ప్రభాకర్ వాక్‌థాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ మానసిక, శారీరక ఒత్తిడి, నిద్ర లేమి కారణంగా గుండె జబ్బులు పెరుగుతున్నాయన్నారు. సాధ్యమైనంత వరకు ఒత్తిడి లేకుండా చూసుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి రోజు వాకింగ్, వ్యాయామం దిన చర్యలో భాగంగా కావాలన్నారు. హాస్పిటల్ సీనియర్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ సుధీర్ కోగంటి మాట్లాడుతూ ఒళ్ళు నొప్పులు, నీరసం, నిద్రలేమి, ఆందోళన, కోపం, మతిమరుపు వంటివి గుండె జబ్బుకు ముందస్తు సూచనలుగా అనుమానించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



శేరిలింగంపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

అంగన్‌వాడీ ఉద్యోగుల నిరసన

శేరిలింగంపల్లి: తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల నిరసన కార్యక్రమాలు శేరిలింగంపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం కొనసాగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనాలు, పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత లేక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయడంతో పాటు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.5 లక్షలు చెల్లించడంతో పాటు ప్రమాద బీమా సౌకర్యం రూ. 5 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

దశలవారీగా డబుల్ ఇళ్ల కేటాయింపు



మియాపూర్‌లోని నరేన్‌గార్డెన్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మియాపూర్ : పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసిన గొప్ప నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీలు పేర్కొన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో భాగంగా మియాపూర్‌లోని నరేన్‌గార్డెన్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఎంపికైన లబ్ధిదారులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వారు హాజరై మాట్లాడుతూ... ఇప్పటి వరకు మూడు విడతల్లో 2,816 మంది లబ్ధిదారులకు అందజేయడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి దశల వారీగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

సనాతన ధర్మం పాటించాలి

మాదాపూర్: సనాతన ధర్మం లేకపోతే బతకలేమని భక్తి రాఘవస్వామి మహారాజ్ తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో వద్ద ప్రీస్కూల్ చైన్ అయిన మై స్కూల్ ఇటలీ పాఠశాలను హరేకృష్ణ ఉద్యమ ఆధ్యాత్మిక నాయకుడు హెచ్‌హెచ్ భక్తి రాఘవస్వామి మహారాజ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మం సార్వత్రిక ప్రవర్తనా నియమావళి అని తెలిపారు. నా శరీరం కెనాడియన్ కాని, ఆత్మ భారతీయం అన్నారు. 9వ నిజాం హెచ్.ఈ.రౌనఖ్ యార్‌ఖాన్ మాట్లాడారు. కార్యక్రమంలో మై స్కూల్ ఇటలీ వ్యవస్థాపకురాలు డాక్టర్ అపర్ణ వల్లూరు పాల్గొన్నారు.

సర్కిల్‌లో 12,363 విగ్రహాల నిమజ్జనం



కోనేరును శుభ్రం చేసిన దృశ్యం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ఈ ఏడాది 12,363 వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.ముఖ్యంగా శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో మాదాపూర్‌లోని దుర్గంచెరువు, రాయదుర్గంలోని మల్కంచెరువు, నల్లగండ్లచెరువు, గోపిచెరువు వద్ద ఉన్న గణేష్ నిమజ్జన కోనేర్లలో ఈ ఏడాది గణనీయంగా నిమజ్జనాలు సాగించారు. శేరిలింగంపల్లి సర్కిల్‌లో నల్లగండ్ల చెరువు వద్ద ఉన్న కోనేరులో అత్యధికంగా 4,824 విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ ప్రాంతంలో అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు ఎక్కువగా ఉండడంతో నిమజ్జనాలు సాగినట్లు అధికారులు తెలిపారు.

కోనేర్లు శుభ్రం.. ఇక బతుకమ్మ వేడుకలకు..

గురువారం అర్ధరాత్రి వరకు నిమజ్జనాలు కొనసాగగా ఎప్పటికప్పుడు విగ్రహాలు, పూజా సామగ్రిని తొలగించేలా జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి సిబ్బందిచే తొలగింప చేశారు. గణేష్ ఉత్సవాలు ముగియడంతో ఇక రానున్న బతుకమ్మ వేడుకల కోసం ఇప్పటి నుంచే కోనేర్లను శుభ్రం చేసి నీటితో నింపాలని అధికారులు నిర్ణయించారు.



గణపతి విగ్రహాలను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

	27వ తేదీ	28వ తేదీ
మాదాపూర్ దుర్గం చెరువు	2,286	677
రాయదుర్గం మల్కంచెరువు	2,985	970
నల్లగండ్ల చెరువు	4,237	587
గోపి చెరువు	0546	075
నిమజ్జనం చేసినమొత్తం విగ్రహాల సంఖ్య	10,054	2,309